

# జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాల్సిందే

- 1.5 అడుగుల ఎత్తున కాలిన నోట్ల గుట్టలు
- అంత డబ్బు ఎలా వచ్చిందో ఆయన చెప్పలేదు
- దర్యాప్తు నివేదికలో కీలక సిఫార్సులు



న్యూఢిల్లీ, మే 28: తన అధికారిక నివాసంలో స్వాధీనం చేసుకున్న కాలిపోయిన నగదుపై ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో వివరణ ఇవ్వడంలో విఫలమయ్యారని దర్యాప్తు నివేదిక వెల్లడించింది. ఇందుకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఆయనను అభిశంసించవచ్చని నివేదిక పేర్కొంది. జస్టిస్ వర్మ ఇంట్లో లభించిన కాలిపోయిన కరెన్సీ నోట్ల ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు అందచేసింది. ఈ నివేదికలోని వివరాలు ఇండియా టుడే సంపాదించింది. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలోని స్టోర్ రూములో దాదాపు 1.5 అడుగుల ఎత్తున కాలిపోయిన కరెన్సీ నోట్ల గుట్ట లభించినట్లు నివేదిక పేర్కొంది. మార్చి 14న జస్టిస్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు ఈ నోట్ల గుట్టలు లభించాయి. ఘటన జరిగిన సమయంలో జస్టిస్ వర్మ ఇంట్లో లేరు. ఈ ఘటన నేపథ్యంలో ఆయనను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు కొలిజీయం బదిలీ చేసింది. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్న సమయంలో ఈ నివేదిక సుప్రీంకోర్టుకు చేరింది.

**నాపై కుట్ర జరిగింది: జస్టిస్ వర్మ**

తన ఇంట్లో లభించిన కాలిపోయిన కరెన్సీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో జస్టిస్ వర్మ వివరణ ఇవ్వలేదని నివేదిక తెలిపింది. తనపైన కుట్ర జరిగిందని ఆయన ఆరోపించినట్లు నివేదిక పేర్కొంది. తనకేమీ సంబంధం లేదని ఖండించడం, కుట్ర జరిగిందని చెప్పడం తప్ప ఆయన నోటి నుంచి వేరే వివరణ రాలేదని నివేదిక పేర్కొంది.

**కుట్రకు అవకాశం లేదు**

మార్చి 14-15 రాత్రి మంటలు చెలరేగిన రోజున జస్టిస్ వర్మకు చెందిన 30-తుగ్లక్ క్రీసెంట్ నివాసంలో ఆయన కుమార్తెతోసహా 17 మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది. కాలిపోయిన నగదు లభించిన స్టోర్ రూము జస్టిస్ వర్మ, ఆయన కుటుంబం అధీనంలోనే ఉందని తెలిపింది. జడ్జి చేసిన కుట్ర ఆరోపణను ప్రస్తావిస్తూ స్టోర్ రూముకు తాళం వేసి ఉన్న కారణంగా బయటి వ్యక్తులు ఆ గదిలోకి వచ్చే అవకాశం లేదని, ఆ గది జస్టిస్ వర్మకు, ఆయన కుటుంబానికి మాత్రమే అందుబాటులో ఉందని నివేదిక స్పష్టం చేసింది. మంటలు చెలరేగిన తర్వాత స్టోర్ రూము నుంచి కాలిపోయిన కరెన్సీని తొలగించడానికి జడ్జికి చెందిన సిబ్బంది ప్రయత్నించినట్లు దర్యాప్తులో తెలిసిందని నివేదికలో పేర్కొన్నారు. జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి రాజేందర్ సింగ్ కర్కీ పాత్రను ప్రధానంగా ప్రస్తావిస్తూ మంటల గురించి ముందుగా జడ్జికి తెలియచేసింది కర్కీయేనని తెలిపారు.

# ఓపీటీ విద్యార్థులపై ట్రంప్ కత్తి!

- ఉద్యోగ వివరాలు అప్‌డేట్ చేయాలని నోటీసులు జారీచేసిన ఐసీఈ విభాగం
- 15 రోజుల్లోగా పూర్తి చేయకుంటే బహిష్కరిస్తామని హెచ్చరించిన అమెరికా
- విదేశీ విద్యార్థులపై ప్రభుత్వం నిఘా పెంచింది: విశ్లేషకులు



వాషింగ్టన్ డీసీ, మే 28: ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) కింద అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కార్ మరో షాక్ ఇచ్చింది. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎస్ఈవీఐఎస్)లో ఉద్యోగ వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. 15 రోజుల్లోగా సరైన వివరాలను నమోదు చేయకపోతే స్వదేశాలకు పంపేస్తామని (డిపోర్ట్) హెచ్చరించింది. ఈ మేరకు తాజాగా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) పలువురు విద్యార్థులకు నోటీసులు ఇచ్చింది. 'మీ ఎస్ఈవీఐఎస్ రికార్డుల్లో ఉద్యోగం చేస్తున్న సంస్థ వివరాలను సరిగా పొందుపరచలేదు. ఒకవేళ సరైన వివరాలతో అప్‌డేట్ చేయకపోతే మిమ్మల్ని నిరుద్యోగులుగా పరిగణిస్తాం. ఓపీటీ పరిమితి పూర్తయితే మీ స్వదేశాలకు పంపాల్సి వస్తుంది' అని స్పష్టం చేసింది. డీఎస్‌వో (డిజిగ్నేటెడ్ స్కూల్ అఫీషియల్)ను సంప్రదించి తాజా ఉద్యోగ వివరాలను సమర్పించాలని సూచించింది. దీంతో అమెరికాలోని వేలాది మంది ఓపీటీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 2022-23 విద్యా సంవత్సరంలో అమెరికాలో 2.70 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 69 వేల మంది ఓపీటీ ప్రోగ్రామ్‌లో భాగస్వాములుగా ఉన్నారు. ఇందులో చాలా మందికి ట్రంప్ సర్కార్ నోటీసులు ఇస్తున్నట్టు విద్యార్థులు చెప్తున్నారు.

**ట్రంప్ ప్రభుత్వం ఏమంటున్నది?**

నిబంధనల ప్రకారం ఓపీటీ విద్యార్థులు కొత్తగా ఉద్యోగంలో చేరినా, కంపెనీ మారినా, బదిలీ అయినా, ఉద్యోగం కోల్పోయినా పది రోజుల్లోగా ఎస్ఈవీఐఎస్ రికార్డుల్లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. కానీ చాలా మంది సంస్థ వివరాలను నమోదు చేయడం లేదన్నారు. దీంతో వారు నిజంగానే ఉద్యోగాలు చేస్తున్నారో లేదో తెలియడం లేదన్నారు. అందుకే ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు.

**ఏమిటీ ఓపీటీ?**

అమెరికాలో చదువు పూర్తయిన విదేశీ విద్యార్థులు అక్కడ పని అనుభవం పొందేందుకు ఇచ్చే అవకాశమే ఓపీటీ. ఎఫ్-1 వీసాపై అమెరికా వెళ్లి బ్యాచిలర్స్ లేదా ఎమ్మెస్ పూర్తి చేసిన విద్యార్థులకు 12 నెలలపాటు అక్కడే ఉండి ఉద్యోగం చేసేందుకు అవకాశం ఇస్తారు. ఏడాది కాలంలో 90 రోజులు మాత్రమే నిరుద్యోగిగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఓపీటీకి ఎంపికైనప్పటి నుంచి దీనిని లెక్కిస్తుంటారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (ఎస్టీఈఎం) సబ్జెక్టులు చదివిన వారికి అదనంగా రెండు సంవత్సరాలు ఓపీటీ ఇస్తారు. దీనిని ఎస్టీఈఎం-ఓపీటీ అంటారు. వీరికి అదనంగా మరో 60 రోజులు నిరుద్యోగిగా ఉండే అవకాశం లభిస్తుంది. నిర్ణీత కాలంలో హెచ్1బీ వీసా స్పాన్సర్ చేసే ఉద్యోగం వెతుక్కొని, లాటరీలో వీసా వస్తే అక్కడే ఉంటూ ఉద్యోగం కొనసాగించవచ్చు. లేకపోతే గడువు ముగిసిన తర్వాత స్వదేశాలకు వెళ్లిపోవాల్సి ఉంటుంది.

**వేలాది మందిపై ఒత్తిడి**

తమ ఉద్యోగ వివరాలను పర్యవేక్షించే బాధ్యత డీఎస్‌వోలదని ఓపీటీ విద్యార్థులు చెప్తున్నారు. ఈ వ్యవహారాల్లో ఇమ్మిగ్రేషన్ విభాగం జోక్యం చేసుకోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా ట్రంప్ ప్రభుత్వం విదేశీ విద్యార్థులపై నిఘా పెంచిందని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా వివరాలు నమోదు చేయకపోతే ఎస్ఈవీఐఎస్ రికార్డులను తొలగిస్తామని ఇమ్మిగ్రేషన్ అధికారులు చెప్తున్నారని, ఇదే జరిగితే ఆయా విద్యార్థులు స్వదేశాలకు తిరిగి వెళ్లడం మినహా మరో మార్గం ఉండదన్నారు. దీనిని బట్టి విదేశీ విద్యార్థులను డిపోర్ట్ చేయడానికి ట్రంప్ సర్కార్ అన్ని రకాల మార్గాలను అన్వేషిస్తున్నట్టు అర్థమవుతున్నదన్నారు. కొన్ని సందర్భాల్లో తమ ఉద్యోగ వివరాలను డీఎస్‌వోకు ఇచ్చినా, నమోదు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని, ఆ ప్రభావం కూడా తమపై పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థులు ఏం చేయాలంటే..**

ఓపీటీ విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని, అయితే కొన్ని సూచనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఓపీటీ కాలంలో ఎక్కడ, ఎన్ని రోజులు ఉద్యోగం చేస్తున్నారో పూర్తి వివరాలతో సొంతంగా రికార్డు తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు. కంపెనీ పేరు, హోదా, సూపర్‌వైజర్ పేరు, వారానికి ఎన్ని గంటల పనిచేశారు.. వంటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. డీఎస్‌వోల నిర్లక్ష్యంతో ఏదైనా పొరబాటు జరిగితే ఈ వివరాలు ఉపయోగపడతాయన్నారు. ఇక ఓపీటీ నిబంధన ప్రకారం 90/150 రోజుల గడువు పూర్తయిన వారు వెంటనే స్వదేశాలకు వెళ్లిపోవాలని సూచిస్తున్నారు. లేదా మరో కోర్సులో చేరి ఎఫ్-1 వీసా గడువు పొడిగించుకోవచ్చన్నారు. చివరి అవకాశంగా స్టూడెంట్ వీసా నుంచి టూరిస్ట్ వీసాకు (బీ-2) మార్చుకోవాలని సూచిస్తున్నారు.

## అమెరికన్లను 'సెన్సార్' చేస్తే వీసా బ్యాన్

వాషింగ్టన్: అమెరికన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై పోస్టులు పెట్టే అమెరికన్లను సెన్సార్ చేసే విదేశీయులకు వీసాలను జారీ చేయకుండా ఓ కొత్త నిబంధనను తీసుకొచ్చారు. అమెరికన్లను వారి దేశంలోనే విదేశీయులు బెదిరించడం ఆమోదయోగ్యం కాదని విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఓ ప్రకటనలో తెలిపారు. అరెస్ట్ వారంట్లు, ఇతర దండన చర్యలు చేపడతామని అమెరికన్లను బెదిరించడం సరికాదన్నారు. అమెరికన్ టెక్ ప్లాట్‌ఫామ్‌లపై అమెరికన్లు పెట్టిన పోస్టుల్లోని కంటెంట్‌ను తొలగించాలని లేదా సరిదిద్దాలని డిమాండ్ చేసే విదేశీయులపై ఈ వీసా నిషేధం నిబంధనను అమలు చేస్తామన్నారు. గ్లోబల్ కంటెంట్ మాడరేషన్ పాలసీలను అనుసరించాలని అమెరికన్ టెక్ కంపెనీలను విదేశీయులు డిమాండ్ చేయడం ఆమోదయోగ్యం కాదని తెలిపారు.


## పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో నేడు మాక్ డ్రిల్

**ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ఆదేశం**

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ జమ్ము కశ్మీరులో గురువారం సాయంత్రం మాక్ డ్రిల్ జరగనున్నది. ఇటీవల నాలుగు రోజుల పాటు జరిగిన సైనిక ఘర్షణల కాలంలో ఈ నాలుగు సరిహద్దు రాష్ట్రాలపైనే పాకిస్థాన్ వైపు నుంచి కాల్పులు జరిగాయి. మాక్ డ్రిల్ సందర్భంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ఆదేశించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కంట్రోల్ రూముల నిర్వహణ, వైమానిక దాడుల హెచ్చరిక వ్యవస్థల పనితీరును మాక్ డ్రిల్ సందర్భంగా పరీక్షించనున్నట్లు వారు చెప్పారు. గురువారం(మే 29) మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నట్లు రాజస్థాన్‌లోని బార్మర్ జిల్లా కలెక్టర్ టీనా దాబీ తెలిపారు.

## నిప్పుతో పుతిన్ చెలగాటం

**రష్యా అధ్యక్షుడిపై ట్రంప్ ఫైర్**



వాషింగ్టన్, మే 28: ఉక్రెయిన్‌పై కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరిస్తుండటం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'మీరు నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని' ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను విమర్శించారు. ఉక్రెయిన్ ఈశాన్య ప్రాంతంలో దాడులకు రష్యా మిలిటరీ సన్నాహాలను ఉద్ధృతం చేయడాన్ని ఆయన ప్రస్తావిస్తూ 'నేను లేకపోతే రష్యాలో ఇప్పటికే పలు దుర్ఘటనలు జరిగి ఉండేవి. పుతిన్ గ్రహించని విషయం ఏమిటంటే అది నిజంగా చెడ్డది. అతను నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు' అని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. దీనికి రష్యా మాజీ అధ్యక్షుడు, పుతిన్ సన్నిహితుడు దిమిత్రి మెద్వెదేవ్ ప్రతిస్పందిస్తూ ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించారు. నిజమైన చెడు ఫలితం మూడవ ప్రపంచయుద్ధం మాత్రమేనని అన్నారు.

**రాతపూర్వక హామీ కోరుతున్న పుతిన్**

ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పాలనుకునే వారికి పుతిన్ కొన్ని షరతులు పెడుతున్నారు. నాటో కూటమిని విస్తరించబోమని రాతపూర్వక హామీని పుతిన్ కోరుకుంటున్నారని రాయిటర్స్ సంస్థ వెల్లడించింది.

## 51వ రాష్ట్రంగా చేరితే 'గోల్డెన్ డోమ్' ఉచితం

**కెనడాకు ట్రంప్ ఆఫర్**

వాషింగ్టన్: కెనడా కనుక అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే తమ దేశం చేపట్టిన 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థలో ఉచితంగా చేరవచ్చునని డొనాల్డ్ ట్రంప్ ఆఫర్ ఇచ్చారు. అలా కాకుండా కెనడా సొంతంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలంటే 61 బిలియన్ డాలర్ల వ్యయమవుతుందని చెప్పారు.

## 4 నుంచి హజ్ యాత్ర

**సౌదీ అరేబియా ప్రకటన**

రియాద్, మే 28: ముస్లింల పవిత్ర స్థలం మక్కాలో ప్రతి ఏటా జరిగే హజ్ యాత్ర జూన్ 4న ప్రారంభమవుతుందని సౌదీ అరేబియా ప్రకటించింది. ఇస్లామిక్ చంద్రమాన క్యాలెండర్‌లోని చివరి నెలలో నెలవంక దర్శనం ఆధారంగా హజ్ యాత్ర తేదీలను సౌదీ అరేబియా సుప్రీం కోర్టు ప్రకటిస్తుంది. ప్రతి ఏటా ఈ తేదీలు మారుతుంటాయి. ఈ ఏడాది జూన్ 4 నుంచి నాలుగు రోజులపాటు హజ్ యాత్ర కొనసాగుతుంది. ఇందులో రెండో రోజు అంటే జూన్ 5న అరాఫత్ మైదానంలో జరిగే సామూహిక ప్రార్థనల్లో హజ్ యాత్రికులు అత్యధిక సంఖ్యలో పాల్గొంటారు. మహమద్ ప్రవక్త చివరి ఉపన్యాసం ఇచ్చిన రోజుగా దీనిని పరిగణిస్తారు. జూన్ 6న ఈద్-అల్-అధాను జరుపుకుంటారు. ఈసారి హజ్ యాత్రలో దాదాపు పది లక్షల మంది ముస్లింలు పాల్గొంటారని అంచనా.

## దరఖాస్తులకు యూపీఎస్సీ కొత్త పోర్టల్

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) బుధవారం కొత్త పోర్టల్ https://upsconline.nic.inను ప్రారంభించింది. అందరు దరఖాస్తుదారులు తాజాగా తమ దరఖాస్తులను నింపి, సంబంధిత డాక్యుమెంట్లను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. గతంలో ఉండే వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) మాడ్యూల్ ఇకపై వర్తించదు. ఈ కొత్త పోర్టల్ వల్ల యూపీఎస్సీ నిర్వహించే వివిధ పరీక్షలకు దరఖాస్తు చేయడంలో సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా, చిట్టచివరి క్షణంలో రద్దీని నివారించవచ్చు. దరఖాస్తుదారులు తమ గుర్తింపు పత్రంగా ఆధార్ కార్డును ఉపయోగించాలని యూపీఎస్సీ తెలిపింది. ఇది అన్ని పరీక్షలకు ఉమ్మడి రికార్డుగా ఉపయోగపడుతుందని పేర్కొంది. సీడీఎస్ ఎగ్జామ్-2, 2025; ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ-2, 2025 కోసం దరఖాస్తులను ఈ కొత్త పోర్టల్ ద్వారానే పంపించాలని స్పష్టం చేసింది.

**నాలుగు భాగాలుగా కొత్త పోర్టల్**

https://upsconline.nic.in పోర్టల్‌లో నాలుగు భాగాలు ఉన్నాయి. వీటిలో అకౌంట్ క్రియేషన్, యూనివర్సల్ రిజిస్ట్రేషన్, కామన్ అప్లికేషన్ ఫాం అన్ని యూపీఎస్సీ పరీక్షలకు ఉపయోగపడతాయి.

# వరికి మద్దతు రూ.69 పెంపు

**14 వానకాల పంటలకు ఎంఎస్పీ ప్రకటించిన కేంద్రం**

**కేసీసీ రుణాలపై వడ్డీ రాయితీ కొనసాగింపు**

న్యూఢిల్లీ, మే 28: వరికి కనీస మద్దతు ధరను (ఎంఎస్పీ) కేంద్రం 3 శాతం పెంచింది. రూ.69 పెంపుదలతో క్వింటాలు ధాన్యం ఎంఎస్పీ రూ.2,369కి చేరింది. వరితోపాటు 14 వానకాల పంటల కనీస మద్దతు ధరలను కేంద్రం బుధవారం ప్రకటించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ వానకాల సీజన్ కోసం వ్యవసాయ శాఖ ఎంఎస్పీపై ఇచ్చిన ప్రతిపాదనలను ఆమోదించింది. నైరుతి రుతు పవనాలు ముందుగానే దేశంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. క్యాబినెట్ సమావేశం అనంతరం సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. వానకాల పంటలకు ఎంఎస్పీ పెంపుతోపాటు వడ్డీ రాయితీ పథకంపై నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కమిషన్ సిఫార్సు మేరకు గడచిన 11 ఏళ్లలో 14 ఖరీఫ్ పంటలకు మద్దతు ధర భారీగా పెరిగిందని మంత్రి తెలిపారు.

**వడ్డీ రాయితీ పథకం కొనసాగింపు**


రైతులకు సవరించిన వడ్డీ రాయితీ పథకాన్ని(ఎంఐఎస్ఎస్) 2025-26 సంవత్సరానికి కొనసాగించడానికి ప్రభుత్వం అంగీకరించింది. దీని కింద రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) ద్వారా తక్కువ ధరలకు స్వల్ప కాలిక రుణం లభిస్తుంది. ప్రస్తుతం అందచేస్తున్న 1.5 శాతం వడ్డీ రాయితీని కొనసాగించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పథకం కింద రైతులకు కిసాన్ క్రెడిట్ ద్వారా 7 శాతం వడ్డీ రేటుపై రూ. 3 లక్షల వరకు స్వల్ప కాలిక రుణం లభిస్తుంది. రుణాలను సకాలంలో చెల్లించే రైతులకు 3 శాతం వరకు ఇన్సెంటివ్(పీపీఆర్)ని ప్రభుత్వం కల్పిస్తుంది. దీంతో కేసీసీ రుణాలకు కేవలం 4 శాతం వడ్డీకే రుణాలు లభించినట్లవుతుంది.

**వానకాల పంటల మద్దతు ధర పెంపు ఇలా.. (క్వింటాలుకు)**

| పంట | పెంపు | పెంచిన తర్వాత |
|---|---|---|
| వరి (కామన్ వెరైటీ) | రూ.69 | రూ. 2,369 |
| వరి (ఏ గ్రేడ్ వెరైటీ) | రూ.69 | రూ.2,389 |
| రాగులు | రూ. 596 | రూ.4,886 |
| జొన్నలు(హైబ్రీడ్) | రూ. 328 | రూ.3,699 |
| మొక్కజొన్న | రూ.175 | రూ.2,400 |
| సజ్జలు | రూ. 150 | రూ.2,775 |
| కందులు | రూ. 450 | రూ.8,000 |
| మినుములు | రూ.400 | రూ. 7,400 |
| పెసలు | రూ.86 | రూ.8,768 |
| వేరుశెనగ | రూ. 480 | రూ.7,263 |
| సోయాబీన్ | రూ. 436 | రూ.5,329 |
| సన్‌ఫ్లవర్ | రూ.441 | రూ.7,721 |
| నువ్వులు | రూ.579 | రూ. 9,846 |
| గడ్డి నువ్వులు | రూ.820 | రూ.9,537 |
| పత్తి (మీడియం స్టేపుల్) | రూ. 589 | రూ.7,710 |
| పత్తి (లాంగ్ స్టేపుల్) | రూ. 589 | రూ.8,110 |

## గాజా హమాస్ చీఫ్ మహ్మద్ సిన్వార్ హతం

**ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ధ్రువీకరణ**



టెల్ అవీవ్, మే 28: హమాస్‌కు చెందిన మరో అగ్రనేతను ఇజ్రాయెల్ హతమార్చింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో గాజా హమాస్ చీఫ్ మహ్మద్ సిన్వార్ మరణించాడు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఈ విషయాన్ని నిర్ధారించారు. గతంలో ఇజ్రాయెల్ దళాల చేతిలో హతమైన యహ్యా సిన్వార్ తమ్ముడే ఈ మహ్మద్ సిన్వార్. కాగా, తాము జరిపిన దాడుల్లో మహ్మద్ సిన్వార్ మృతి చెంది ఉండవచ్చునని ఇజ్రాయెల్ కొద్ది రోజుల క్రితమే పేర్కొంది. దక్షిణ గాజాలోని యూరోపియన్ హాస్పిటల్ భూగర్భ కమాండ్ కాంపౌండ్ కింద సిన్వార్ దాగి ఉన్నారన్న సమాచారం మేరకు ఇజ్రాయెల్ దళాలు దాడులు జరిపాయి. ఈ దాడిలో మహ్మద్ సిన్వార్‌తో పాటు హమాస్ రఫా బ్రిగేడ్ కమాండర్ మహమ్మద్ షబానా కూడా మరణించాడు. 2024 అక్టోబర్‌లో యహ్యా సిన్వార్ మృతి చెందిన తర్వాత మహ్మద్ సిన్వార్ హమాస్ నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు.

## హెచ్ఏఎల్‌పై కర్ణాటక, ఏపీ టగ్ ఆఫ్ వార్

**యూనిట్‌ను ఏపీకి తరలింపు వార్తలపై వివాదం**

బెంగళూరు: తేజస్ వంటి ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను తయారు చేసే కేంద్ర సంస్థ 'హిందుస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్' (హెచ్ఏఎల్)పై కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య టగ్ ఆఫ్ వార్ నడుస్తున్నది. ఇటీవలి ఢిల్లీ పర్యటనలో ఏపీ సీఎం చంద్రబాబు, 'నూతన గ్రీన్‌ఫీల్డ్ హెచ్ఏఎల్' యూనిట్‌ను ఏపీలో ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనను కేంద్రం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముందు ఉంచారని తెలిసింది. ఏపీ-కర్ణాటక సరిహద్దులోని లేపాక్షి వద్ద 10వేల ఎకరాలు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు ఏపీ సీఎం కేంద్రానికి తెలిపారట. కాగా ఈ వార్తల్ని కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ ఖండించింది. హెచ్ఏఎల్‌ను ఏపీకి తరలిస్తారన్న వార్తల్ని తోసిపుచ్చింది. దీనిపై కేంద్రంలోని మోదీ సర్కార్ మాత్రం నోరు మెదపటం లేదు.

## కొవిడ్‌తో యూపీ వ్యక్తి మృతి

చండీగఢ్: కొవిడ్-19తో బాధపడుతూ ఓ వ్యక్తి (40) చండీగఢ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల, దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించారు. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందినవారు. లూధియానా వైద్యులు ఆయనకు శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నట్లు చెప్తూ, చండీగఢ్‌కు పంపించారని అధికారులు చెప్పారు. ఆయనకు కరోనా పాజిటివ్ అని మంగళవారం నిర్ధారణ అయిందన్నారు. ఇటీవల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి.



## క్యాన్సర్‌ను గుర్తించే స్మార్ట్ శానిటరీ ప్యాడ్స్

న్యూఢిల్లీ: రుతుస్రావ రక్తాన్ని పరీక్షించి క్యాన్సర్, శరీరం లోపలి భాగాల్లో మంటకు సంబంధించిన వ్యాధులను గుర్తించే స్మార్ట్ శానిటరీ ప్యాడ్స్‌ను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ వినూత్న విధానంలో, శానిటరీ టవల్‌లో నాన్ ఎలక్ట్రానిక్ సెన్సర్‌ను ఉంచుతారు. స్మార్ట్‌ఫోన్‌తో తీసిన ఫొటోలను, మెన్‌స్ట్రుఏఐ అనే ప్రత్యేకమైన యాప్‌ను ఉపయోగించి రుతుస్రావ రక్తాన్ని పరీక్షిస్తారు. దానిలోని బయోమార్కర్స్‌ను విశ్లేషిస్తారు. ఈ రక్తం చాలా విలువైన సమాచారానికి ఆధారమని తాము నిరూపించామని ఈ అధ్యయనకర్తల్లో ఒకరైన లూకాస్ డోస్నన్ చెప్పారు.

# ప్రతి ఇంటికీ డిజిటల్ అడ్రస్ ఐడీ!

- ఆధార్ తరహాలో యూనిక్ నంబర్ కేటాయింపు
- 'డిజిటల్ అడ్రస్ సిస్టమ్' తేనున్న కేంద్ర ప్రభుత్వం
- చిరునామా కనుగొనడంలో ఇబ్బందులకు ఇక చెక్!

*న్యూఢిల్లీ, మే 28:* మహానగరాల్లో కొత్త వారు ఏదైనా ఒక అడ్రస్ కనుగొనడమంటే కత్తి మీద సాము చేయడం వంటిదే. గూగుల్ మ్యాప్ సైతం కచ్చితత్వంతో మనం కోరుకున్న చిరునామాకు మనలను తీసుకెళ్లలేకపోతున్నది. కొన్నిసార్లు మనం వెళ్లదలచుకున్న ప్రదేశాన్ని సమీపంలోని బండగుర్తు (ల్యాండ్‌మార్క్) ఆధారంగా కనుగొనాల్సి వస్తుంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి ఇంటికి (చిరునామాకు) ఆధార్ తరహాలో ఓ ప్రత్యేకమైన డిజిటల్ గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్టు తెలిసింది. దీంతో ప్రతి భారతీయుడి నివాసానికి అధికారికమైన ఓ ప్రత్యేక గుర్తింపు నంబర్ (డిజిపిన్ నంబర్) లభించనుంది. తాను నివసిస్తున్న ప్రదేశానికి భవిష్యత్తులో ఇదే ఐడీ ప్రూఫ్‌గా మారనుంది. నివాసాలను, ప్రదేశాలను కచ్చితంగా, వేగంగా కనుగొనే లక్ష్యంగా ఈ ప్రత్యేక డిజిటల్ ఐడీ నంబర్ పంపిణీకి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు ఓ ఆంగ్ల పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతమున్న భౌతిక చిరునామాలను డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) వ్యవస్థలో అనుసంధానం చేయడానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్నది. ప్రస్తుతం దేశంలో అడ్రస్‌ల డాటాను నిర్వహించేందుకు ఓ ప్రామాణికమైన వ్యవస్థ అందుబాటులో లేదు. దీంతో ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని చాలామంది తప్పుడు అడ్రస్‌లతో మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈ చిరునామాల డాటాకు సంబంధించి దేశంలో స్పష్టమైన నియమ నిబంధనలు అమలులో లేకపోవడంతో పలు ప్రైవేటు కంపెనీలు పౌరుల వద్ద వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, వారి అనుమతి లేకుండానే ఇతరులతో పంచుకుంటున్నాయి. ప్రభుత్వం అమలుచేయనున్న కొత్త డిజిటల్ ఐడీలతో ఈ అక్రమాలన్నింటికీ అడ్డుకట్టవేయవచ్చని ఆ పత్రిక కథనం వివరించింది. డిజిటల్ ఐడీలతో పౌరుల వ్యక్తిగత వివరాలు వారి నియంత్రణలో ఉండిపోతాయి. ఎవరైనా ఆ వివరాలను పొందాలంటే ఇకపై సదరు వ్యక్తి అనుమతి ద్వారానే సాధ్యం కానుంది.

***ఏటా 1.14 లక్షల కోట్ల నష్టం***

ప్రస్తుతం దేశంలో ఈ-కామర్స్ వ్యవస్థ జోరందుకుంది. లాజిస్టిక్స్, యాప్ ఆధారిత సేవలు (హోం డెలివరీ) విపరీతంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సేవలందించేందుకు కచ్చితమైన, ప్రామాణికమైన అడ్రస్‌ల అవసరం పెరిగిపోయింది. దేశంలో ప్రస్తుతం చాలా చిరునామాలు అస్పష్టంగా లేదా అసంపూర్ణంగా ఉంటాయి. కొన్ని అడ్రస్‌లను కనుగొనాలంటే వాటి సమీపంలోని ఏదైనా ఓ ప్రాముఖ్యమైన ప్రదేశం ఆధారంగా కనుగొనాల్సి వస్తుంది. ఈ అస్పష్టత కారణంగా సేవల వితరణ ఆలస్యమై, ఒక చోట ఇవ్వాల్సిన డెలివరీని మరో చోట ఇవ్వడం, తదితర కారణాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10-14 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.14 లక్షల కోట్లు) నష్టం వాటిల్లుతున్నది. ఇది జీడీపీలో 0.5శాతమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం 'డిజిటల్ అడ్రస్ సిస్టమ్'ను అమలులోకి తేనున్నది. దీని ద్వారా ఏదైనా సంస్థ ఆన్‌లైన్‌లో మన చిరునామాను పొందాలంటే తప్పనిసరిగా మన అనుమతి పొందాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణకు త్వరలోనే ఓ ముసాయిదా విధానాన్ని విడుదల చేయనున్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ చట్టానికి సంబంధించి తుది రూపునివ్వనున్నట్టు తెలిసింది.

**పది అంకెల యూనిక్ నంబర్**

*ఈ కొత్త అడ్రస్ వ్యవస్థకు డిజిపిన్ (డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్) కీలకం కానుంది. ఈ నంబర్ పది అంకెలు, అక్షరాలతో ఉంటుంది. కచ్చితమైన మ్యాప్ కోఆర్డినేట్‌ల ఆధారంగా ఓ ప్రత్యేకమైన 10 అక్షరాల కోడ్‌గా దీనిని రూపొందించనున్నారు. ప్రస్తుతమున్న పిన్‌కోడ్ నంబర్లు పోస్ట్ ఆఫీస్‌ల ఆధారంగా విస్తారమైన ప్రదేశాలకు కేటాయించారు. కానీ డిజిపిన్‌లను కచ్చితత్వంతో వ్యక్తుల ఇండ్లకు లేదా వ్యాపారాలకు కేటాయించనున్నారు.*



## ప్రస్తుత వ్యాక్సిన్లు నిరోధిస్తాయా?

న్యూఢిల్లీ, మే 28: ఆరేండ్ల క్రితం తొలిసారి ప్రపంచవ్యాప్తంగా విజృంభించిన కొవిడ్-19 మహమ్మారి ఇప్పుడు మళ్లీ కోరలు చాస్తున్నది. ఇప్పటికే భారత్ సహా ఆసియాలోని పలు ప్రాంతాల్లో, అమెరికాలో కొవిడ్ ఇన్ఫెక్షన్లు పెరిగాయి. భారత్‌లో వెయ్యికిపైగా యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం భారత్‌లో ఒమిక్రాన్ ఉప వేరియంట్ ఎన్‌బీ 1.8.1తోపాటు ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1 రకాల వైరస్ జాతులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగా 'సార్స్-కోవ్-2' కూడా ఉత్పరివర్తనాల వల్ల కాలానుగుణంగా ఇన్ఫెక్షన్ల పెరుగుదలకు కారణమవుతున్నప్పటికీ ప్రస్తుతం భారత్‌లో అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు ఈ వేరియంట్లను నిరోధించేందుకు అనుకూలంగా లేవని స్పష్టమవుతున్నది.